# జగనన్న కాలనీపై కూటమి నిర్లక్ష్యం

- సమస్యలతో కాలనీవాసుల సతమతం
- తాగునీరు, రోడ్లు లేక ఇబ్బందులు


పేటలోని బలుసుపాడు రోడ్డులోని జగనన్న కాలనీ

**జగ్గయ్యపేట అర్బన్:** గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని బలుసుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తమ కాలనీలో సమస్యలు పట్టించుకునేవారు లేరని, తాము నిరాదరణకు గురవుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని బలుసుపాడు రోడ్డులో లే అవుట్‌లు ఏర్పాటుచేసి ఎల్‌పీ-1 లో 140 గృహాలు, ఎల్‌పీ-2 లో 540 గృహాలు మంజూరు చేశారు. ఎల్‌పీ-1 లో కొద్ది మంది మాత్రమే(30 మంది) గృహాలు నిర్మించుకోగా, ఎల్‌పీ-2 లో సుమారు 300 మంది గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కాలనీలో వైద్య సేవల కోసం అర్బన్ హెల్త్ సెంటర్ ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. కాగా మిగిలిన మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించేలోగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మారిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పడింది.


అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

### పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మారిన రాజకీయ పరిణామాలతో కూటమి ప్రభుత్వం ఈ కాలనీని పట్టించుకోడం లేదు. దీంతో పట్టణానికి కాలనీకి సంబంధాలు తెగిపోయినట్లుగా ఉంది. ఫలితంగా సమస్యలను కాలనీ వసులు తట్టుకోలేక అనేక మంది పట్టణానికి తరలివెళ్లి ఇళ్లు అద్దెకు తీసుకుని జీవించాల్సి వస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలలుగన్న పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర చరిత్రలో ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల మందికి ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నేడు ఈ కాలనీ పట్ల అధికారులు, పాలకులు వివక్షత చూపిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కాలనీకి ఆనుకుని చెత్తతో నిండిపోయిన కాలువ

### కలుషిత నీటితో అవస్థలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినప్పటికీ జగనన్న కాలనీలో తాగునీటి సౌకర్యం లేక, రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో పాటు సుమారు 20 వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలేటి నుంచి పైపులైన్ ద్వారా వచ్చే కలుషితం అయిన నీటి వలన దురదలు వస్తున్నాయి. దీంతో వాడుకోవడానికి కూడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యలను మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలనీలో రేషన్ షాపు లేకపోవడంతో జగ్గయ్యపేట పట్టణంలోకి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా ప్రతి నెలా పెన్షన్ల కోసం కూడా రూ.2 కి.మీ. దూరంలో ఉన్న జగ్గయ్యపేట పట్టణానికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని, ఆటోలో వెళ్లాలంటే రూ.200 ఖర్చు అవుతుందని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడం వలన నిర్మాణంలో ఉన్న అనేక గృహాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

### ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన కాలువ

కాలనీ సమీపంలో నుంచి వెళుతున్న మురుగునీటి కాలువలో బయట వారు ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయడంతో కాలువ నిండిపోయి భరించలేని దుర్వాసన వస్తోంది. దీంతో కాలువ యజమానులు దానిని శుభ్రంగా ఉంచాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


గృహాల మధ్య పెరిగిన కంపచెట్లు

### కంపచెట్లతో ఇబ్బందులు



కాలనీలో గృహాల మధ్య కంపచెట్లతో ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. పాలేటి నుంచి పైపులైన్ ద్వారా గతంలో వచ్చే నీరు కర్మాగారాల కలుషితం వలన దురదలు వస్తున్నాయి. కావున బోరు పంపులు ఏర్పాటుచేసి ఉన్న ట్యాంకులకు కనెక్షన్ ఇస్తే కొంత వరకు సమస్య తీరుతుంది.

– మార్కపూడి బాబు, కాలనీవాసి

### సమస్యల పరిష్కారానికి కృషి



జగనన్న కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పాలేటిలో మోటార్ కొట్టుకుపోయిన తరువాత మళ్లీ కొత్త మోటార్ ఏర్పాటు చేశాం. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే సరిచేస్తాం. కాగా శాశ్వత నీటి పరిష్కారంగా త్వరలో సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్లతో పాటు ఈఎస్ఎల్ఆర్ ట్యాంకు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి సౌకర్యం కల్పిస్తాం.

– డీటీవీ కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్

## క్లుప్తంగా

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



**నందిగామ రూరల్:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించటంతో పాటు విధిగా రోడ్డు నిబంధనలకనుగుణంగా వాహనాలు నడపాలని ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబారుపేట వైజంక్షన్ అండర్‌పాస్ వద్ద బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలకు జరిమానా విధించారు.

### విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



**జగ్గయ్యపేట:** విత్తనశుద్ధి చేయటం వల్ల తెగుళ్ల వ్యాప్తిని నియంత్రించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ పేర్కొన్నారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, అన్నవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తుగా వర్షాలు కురుస్తున్నాయని, ఖరీఫ్ ముందస్తు పనులకు రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని, ఘన జీవామృతం, పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు వేయాలని తెలిపారు. సేంద్రియ సాగును చేపట్టి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో పచ్చిరొట్ట, వరి విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని అగ్రి ల్యాబ్‌లో ఉచితంగా విత్తనాలు, ఎరువులను పరీక్షించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, ఉద్యాన శాఖాధికారి నీలిమ, వ్యవసాయాధికారి హారిక పాల్గొన్నారు.

### కేంద్రీయ విద్యాలయ భవనం పరిశీలన



**నందిగామ రూరల్:** పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ ట్రెనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ లోవరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దిశ సమావేశంలో ప్రతిపాదించిన కేంద్రీయ విద్యాలయాలను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారన్నారు. దీంతో కేంద్రీయ విద్యాలయ భవనాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అనంతరం శాశ్వత భవనం నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రతిపాదించిన స్థలాన్ని కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### చెత్త మయం



**నందిగామ రూరల్:** పట్టణంలోని మెయిన్ బజారుతో పాటు పలు ప్రధాన వీధుల్లోని రహదారులు చెత్త పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని మెయిన్ బజారు వ్యాపార, వాణిజ్య సముదాయాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. దీంతో పట్టణంతో పాటు నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాలకు చెందిన ప్రజలు నిత్యం వేల సంఖ్యలో వచ్చి వెళ్తుంటారు. ఆయా పనులపై మెయిన్ బజార్‌కు వచ్చే ప్రజలకు చెత్త మయంగా మారిన రహదారులు స్వాగతం పలుకుతున్నాయి.

**దుర్గంధభరితం**

చెత్త డంప్ చేసుకునే లారీ మరమ్మతులకు గురవటంతో రెండు, మూడు రోజులుగా మెయిన్ బజారు రహదారి మధ్యలో ఉన్న చెత్త కుండీలలో చెత్తను తొలగించటం లేదని దుకాణదారులు, స్థానికులు పేర్కొన్నారు. దీంతో పాటు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెత్త, ఆహార వ్యర్థాలు కుళ్లిపోయి మెయిన్ బజారు మొత్తం భరించలేని దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్తను తక్షణమే తొలగించి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### ఇటుక బట్టీలకు తరలుతున్న చెరువు మట్టి

**పట్టించుకోని అధికారులు**


జగ్గయ్యపేట చెరువు నుంచి గండ్రాయిలోని ఇటుక బట్టీలకు వెళుతున్న మట్టి ట్రాక్టర్

**జగ్గయ్యపేట:** రైతుల పంట పొలాల్లోకి చెరువు మట్టిని తోలాల్సి ఉండగా కొందరు అక్రమార్కులు ఆ మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. పట్టణంలోని ఊర చెరువు నుంచి రెండు రోజులుగా అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలను సాగిస్తున్నారు. రైతుల పంట పొలాలకు మట్టి తోలేందుకు అనుమతులు తీసుకుని అక్రమార్కులు ఇటుక బట్టీలకు తోలుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు మట్టిని మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, జయంతిపురం గ్రామాల్లోని ఇటుక బట్టీలకు యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. చెరువులో జేసీబీలను ఏర్పాటు చేసి ట్రాక్టర్‌కు రూ.200 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తూ మట్టి తరలిస్తున్నారు. రోజుకు 50 నుంచి 100 ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు కూడా ఆ వైపు కన్నెత్తి చూడకపోవటంతో అక్రమార్కులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కూటమి నేతల ఆశీస్సులుండటంతోనే అధికారులు కూడా పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమ తరలింపును నియంత్రించటంతో పాటు పంట పొలాలకు తోలుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి


ఫిరోజ్‌ఖాన్ దంపతులను సన్మానించిన తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి చిన్నా, నాయకులు

**వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు**

**జగ్గయ్యపేట అర్బన్:** వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన పఠాన్ ఫిరోజ్‌ఖాన్ నేతృత్వంలో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించి మున్సిపల్ కార్యాయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఫిరోజ్‌ఖాన్ అభినందన సభ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫిరోజ్‌ఖాన్ దంపతులను తన్నీరు నాగేశ్వరరావు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) తదితర నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిరోజ్‌ఖాన్ నాయకత్వంలో పట్టణంలోని 31 వార్డుల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. తద్వారా పట్టణంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలుగా ఉన్న టిడ్కో గృహాలు, హైవే బస్టాండ్, టీటీడీ కల్యాణ మండపం తమ పార్టీలో నిర్మాణం చేసి ప్రారంభించినప్పటికీ వాడుకలోకి తీసుకురాలేదన్నారు. ఇంకా మార్కెట్‌యార్డు నుంచి హైవే వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం, రోడ్లు, డ్రెయిన్ల తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, పార్టీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, జిల్లా కార్యదర్శులు షేక్ జుబేర్, మాతంగి నాగబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు యామిని రామిరెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, పట్టణ ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పిడమర్తి ప్రభు, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు అన్నెపాగ మురళి, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, న్యాయవాది సత్యశ్రీనివాస్, నాయకులు జవ్వాజి నరసింహారావు, గూడపాటి శేషయ్య, శ్రీనివాసగౌడ్, బండి రాజు, మెట్టు ఏడుకొండలు, ఉప్పెల్లి పెంటయ్య, వేముల విజయ్, పానుగంటి నాయుడు, గుంజ ఆశీర్వాదం, బజారు సాయి, షేక్ షావుద్దీన్, అమ్మనబోయిన గోపి, మోరె దుర్గాప్రసాద్, రన్ హుస్సేన్, కరిసె ఇశ్రాయేలు, మెండెం రామారావు, దర్శి వెంకటేశ్వర్లు, మన్నె అప్పారావు, చేని రాంబాబు, పాతకోటి ఉదయభాను, డి.రాంబాబు పాల్గొన్నారు.

### జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా ఫిరోజ్‌ఖాన్



**జగ్గయ్యపేట అర్బన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడిగా పఠాన్ ఫిరోజ్‌ఖాన్ నూతనంగా నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సిఫార్సుతో ఫిరోజ్ ఖాన్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

### ప్రత్యామ్నాయ పవర్ సిస్టంపై దృష్టి సారించండి

**నందిగామ టౌన్:** ప్రత్యామ్నాయ పవర్ సిస్టంను వినియోగించుకోవటంపై ప్రజలు దృష్టి సారించాలని విద్యుత్ శాఖ జేఈ గౌతమ్ చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక కేవీఆర్ కళాశాల్లో సోలార్ ఎనర్జీ ఉపయోగాలపై కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో బొగ్గు నిల్వలు నిండుకోవటం వల్ల తీవ్రమైన కొరత ఏర్పడి థర్మల్ పవర్ సరఫరా సాధ్యం కాకపోవచ్చన్నారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసుకునే సోలార్ సిస్టంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. సూర్యఘర్ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందిస్తున్న సోలార్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధి మధుసూధనరావు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

**కొణకంచి(పెనుగంచిప్రోలు):** మండలంలోని కొణకంచి గ్రామంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ ఎంఎస్‌కే అర్జున్ మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు గ్రామంలో పేకాట శిబిరంపై తమ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.6వేలు నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన నేతలు


మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షుడు రాచగొల్ల రమేష్‌యాదవ్, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సీఎం జగన్‌కు మార్త శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేశారు. – కంచికచర్ల

## వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ


ముచ్చింతాల వద్ద పత్తి విత్తనాల సాగుకు అచ్చు తోలుతున్న రైతు


తాళ్లూరు సమీపంలో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

**వర్షంతో విత్తనాలు విత్తుతున్న రైతులు**

**పెనుగంచిప్రోలు:** మూడు రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. మూడు రోజుల క్రితం వరకు ఎండలు, వడగాలులతో విత్తిన పత్తి మొక్కలు కొన్ని మొలవలేదు. మరికొన్ని మొలిచినా వడబడి పోయాయి. ఈ క్రమంలో వర్షాలు పడుతుండటంతో రైతులు పత్తి సాగుకు అచ్చు తోలటంతో పాటు కొందరు విత్తనాలు నాటుతున్నారు. మొత్తం మీద వర్షాలు మెట్ట రైతులకు కొంత సంతోషాన్నిచ్చాయి. ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ శాఖాధికారుల అంచనాలు ప్రకారం వరి 7,333 హెక్టార్లు, పత్తి 7,797 హెక్టార్లు, మిర్చి 6,973 హెక్టార్లు, మొక్కజొన్న 81 హెక్టార్లు సాగు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. రైతులు వరి సాగుకు కూడా నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.

### పార్కుపై దృష్టి పెట్టండి

**జగ్గయ్యపేట అర్బన్:** జగ్గయ్యపేట మున్సిపాలిటీకి ఉన్న ఏకైక పార్కు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్స్ అభ్యర్థన మేరకు తుమ్మల ప్రభాకర్, 3వ వార్డు కౌన్సెలర్ కాశీ కిషోర్ మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును ఫోన్ ద్వారా పిలిపించి అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్ గదులను చూపించారు. అలాగే గేటు బయట ఉన్న టాయిలెట్లు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయని, వాటిని శుభ్రం చేయించాలని కోరారు. పార్కు గేటు దగ్గర బురదగా ఉండటం వలన గ్రావెల్ వేయించాలని, పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**నందిగామ ఏసీపీ బాలగంగాధర్ తిలక్**


నెహ్రూ బొమ్మ సెంటర్‌లో నిర్వహించిన మానవహారంలో పోలీసులు, విద్యార్థులు

**కంచికచర్ల:** విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే జీవితంలో అనుకున్నది సాధించవచ్చని నందిగామ ఏసీపీ బాలగంగాధర్ తిలక్ పేర్కొన్నారు. మండలంలోని పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాల్లో బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఎంత కష్టమైనా సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులు సూచన మేరకు నడుచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నరని వారి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇతరులు ఎవ్వరికీ ఓటీపీలు చెప్పకూడదన్నారు. ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతుల ఇళ్లల్లో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయని, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కంచికచర్ల నెహ్రూబొమ్మ సెంటర్‌లో విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించారు. అనంతరం నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి పెట్రోలు బంక్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఏసీపీ పావని, నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్‌దేవ్, ఎస్‌ఐ బోనగిరి రాజు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

**కంచికచర్ల:** అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిఉండాలని ఫైర్ అధికారి ఏ శివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక విజయరాణి ఉన్నత పాఠశాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించటంతో పాటు కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇళ్లలో గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో తడి లేకుండా చూసుకోవాలన్నారు. వంట గదిలో గ్యాస్ లీకయితే ముందుగా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. ఒక్కోసారి బస్సులో ఇంజిన్ వేడెక్కటం వల్ల కూడా మంటలు వస్తుంటాయన్నారు. అంతేకాకుండా బస్సు ప్రయాణించే సమయంలో టైర్ల రాపిడి వల్ల కూడా మంటలు వస్తుంటాయన్నారు. బస్సులో అగ్నిప్రమాదం జరిగితే కిటికీల ద్వారా బయటకు రావాలని సూచించారు. అనంతరం పాఠశాలలో డెమో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ జాన్సీ పాల్గొన్నారు.

## నేటి నుంచి వృద్ధులకు ఇంటింటికీ రేషన్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

**నందిగామ టౌన్:** దివ్యాంగులు, 65 ఏళ్లకు పైబడిన వారికి గురువారం నుంచి రేషన్ డీలర్ల ద్వారా రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు ఆర్డీఓ బాలకృష్ణ తెలిపారు. రేషన్ సరుకుల పంపిణీపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రేషన్ డీలర్లు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌తో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెలకు సంబంధించి ఈ నెల 26 నుంచి 30వ తేదీ లోపు రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, పౌర సరఫరాల డీటీ రామ్మూర్తి రెడ్డి పాల్గొన్నారు.

**సచివాలయ సిబ్బందికి పర్యవేక్షణ బాధ్యతలు**

మండలంలోని అన్ని రేషన్ దుకాణాల పరిధిలోని దివ్యాంగులు, 65 ఏళ్లకు పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.